మా రేషన్ మాకు ఇవ్వండి..

- ప్రకాశ్‌నగర్ మహిళలు తహసీల్దార్ కార్యాలయం వద్ద మొర
- సగం మందికి ఇచ్చి అయిపోయాంటున్నారని ఆవేదన
- మాకు ఇవ్వకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం


రేషన్ ఇవ్వలేదంటూ తాహసీల్దార్ కార్యాలయం వద్ద కార్డులతో నిరసన తెలుపుతున్న ప్రకాశ్‌నగర్ మహిళలు

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా ప్రజలకు అందిస్తున్న రేషన్‌ను మాకు ఇవ్వకుండా అయిపోయాయి అంటున్నారే.. మా రేషన్ మాకు ఇవ్వండి లేదంటే నిరసన వ్యక్తం చేస్తామని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఎర్రగుంట్ల పట్టణంలోని 1 షాపునకు సంబంధించిన ప్రకాశ్‌నగర్ కాలనీ వాసులు రేషన్ కార్డులు పట్టుకుని తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఇలానే మండల వ్యాప్తంగా రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు సకాలంలో రేషన్ అందక పరేషన్ పడుతున్నారు. ఏప్పుడు చౌక దుకాణాలు తెరుస్తారో.. ఏప్పుడు ఎండియూ వాహనాలు ఇంటింటికి వస్తాయో తెలియని పరిస్థితిలలో ఉన్నామని లబ్ధిదారులు అంటున్నారు.

ఈ సందర్భంగా కార్డుదారులైన మహిళలు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ తీసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. నెలనెల షాపుల వద్దకు పోయి రేషన్ తీసుకుంటున్నా... కొన్నిసార్లు రేషన్ అయిపోయాంటున్నారు. అంతేకాక మాకు తక్కువ తుకాలతో రేషన్ ఇస్తున్నారన్నారు. ఈనెల 9వ తేదీ వచ్చిన మా కాలనీకి ఎండియూ వాహనం రాలేదు. షాపు వద్దకు పోతే ఇంటింటికి పంపిణీ చేస్తామని ఎండియూ ఆపరేటర్లు బియ్యం తీసుకుని పోయారని అంటున్నారని వాపోయ్యారు. మా కాలనీకి వచ్చే ఎండియూ ఆపరేటర్ మా కాలనీ రాకుండా మేం ఇళ్ల వద్ద లేమని సాకులను అధికారులకు చెప్పి రేషన్ ఇవ్వలేదన్నారు. ఇప్పుడు తీర అడిగితే షాపులోనే రేషన్ అయిపోయిందటున్నారు. మాకు రేషన్ మాకు ఇవ్వకుండా ఎక్కడి పోతున్నాయి. మా కాలనీ నిత్యం సమీపంలో పాలీస్‌మిషన్‌లలో, గనులలో కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాం. మాకు రేషన్ ఇప్పించాలని వారు వాపోయ్యారు. మాకు రేషన్ ఇవ్వకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు.

మండల పరిధిలోని ఎర్రగుంట్ల పట్టణంతో పాటు 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఎర్రగుంట్ల మున్సిపాలిటీతో కలుపుకుని 37 ప్రభుత్వ చౌక దుకాణాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 20,785 రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డులకు ఇవ్వాల్సిన బియ్యంలో ఐదు కిలోలు తక్కువగా ఇస్తున్నారని పలువురు వాపోతున్నారు. కార్యాలయంలో రెవెన్యూ అధికారులందరితో వారి సమస్యలను చెప్పుకున్నారు.

డిప్యూటీ తహసీల్దార్ ఏమన్నారంటే..

ఈ విషయంపై డిప్యూటి తహసీల్దార్ యామని వివరణ కోరగా ఇది వరకే కాలనీలోని మహిళలు అడిగారన్నారు. బియ్యం ఎందుకు ఇవ్వలేదని ఆర్ఐని పంపించి విచారణ చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

నియోజకవర్గ వర్గ వ్యాప్తంగా ఉన్న రేషన్ షాపులు		
మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డులు
యర్రగుంట్ల	37	20785
జమ్మలమడుగు	37	20879
ముద్దనూరు	30	10435
మైలవరం	31	12728
కొండాపురం	35	11885
పెద్దముడియం	25	9275

మా కాలనీ వాసులకు బియ్యం ఇవ్వలేదు..



మా కాలనీ వాసులకు బియ్యం ఇవ్వలేదు. మాకు ఇవ్వకుండా బైపాసు రోడ్డుకు వెళ్లి అక్కడ ఇస్తున్నారు. ఇది ఏమిటన అడిగితే సరైన సమాధానం లేదు. మేం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు అడిగితే బియ్యం లేవంటున్నారు. మా బియ్యం ఎక్కడి పోతాయి. మాకు చెప్పాల్సిన బాధ్యత అధికారులకు ఉందా లేదా...? నెల కూడా మాకు రేషన్ అందే పరిస్థితి కనిపించలేదు. జిల్లా కలెక్టర్ మా సమస్యపై స్పందించాలి.

– రాణీ, ప్రకాశ్‌నగర్, ఎర్రగుంట్ల

ఎవరైతే బియ్యం అమ్ముతారో.. వారికే బియ్యం



ఇంటింటికి రేషన్ ఇస్తున్న ఎండియూ వాహన ఆపరేటర్ ఏవరైతే బియ్యం అమ్ముతారో వారికే బియ్యం ఇస్తున్నారు. మా కాలనీలో బియ్యం ఇవ్వకుండా నేరుగా బైపాసు రోడ్డుకు పోయి అక్కడ బియ్యం ఇచ్చి వాటిని వెంటనే కొంటున్నారు. మాకు ఇవ్వాల్సిన బియ్యం ఎక్కడికి పోయాయి. అవి కూడా తక్కువగా ఇస్తున్నారు. ఇప్పుడు ఇవ్వకుండా స్టాక్ లేదంటూన్నారు.

– మరియమ్మ, ప్రకాశ్‌నగర్, ఎర్రగుంట్ల

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

కమలాపురం : పట్టణంలోని వికలాంగుల కాలనీలో గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమియో పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరీ శామ్యూల్ హానిమన్ యొక్క జయంతిని పురస్కరించుకుని ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్లు, మోకాళ్ల నొప్పులు, అలర్జీ, తుమ్ములు, ముక్కులో కండ పెరగడం, గ్యాస్ ట్రబుల్, కిడ్నీలో రాళ్లు, స్త్రీ సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఆయాసము, ఆస్తమా తదితర వ్యాధులకు ప్రత్యేకంగా పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

దినసరి వేతనం రూ.307కు పెంపు

పెద్దముడియం : ఉపాధి హామీ పథకంలో కూలీల దినసరి వేతనం రూ.307కు ప్రభుత్వం పెంచిందని, ఇది 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు కానుందని ఏపీవో వెంకటసుబయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేసవి కాలం కావడంతో ఏండతీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న దృష్ట్యా కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల్లోగా పని చేసే ప్రదేశంలో పనులు ముగించుకుని గృహాలకు చేరుకోవాలన్నారు. అలాగే పాంపాండ్స్‌పై దృష్టి సారించి రైతులు పొలాల వద్ద తవ్వకాలు ప్రారంభించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొండాపురం ఎస్ఐగా ప్రతాప్‌రెడ్డి



కొండాపురం : స్థానిక ఎస్ఐగా యు.ప్రతాప్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎ.విద్యాసాగర్ కమలాపురం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఏ సమస్య వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చిన్న చిన్న సమస్యలతో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

హౌసింగ్ కాలనీలో ఇళ్ల పరిశీలన


ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ రాజారత్నం

ఎర్రగుంట్ల : పట్టణ, మండల పరిధిలో నిర్మాణంలోని హౌసింగ్ కాలనీలలోని ఇళ్లను హౌసింగ్ పీడీ రాజారత్నం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అడిషనల్‌గా ఇస్తున్న డబ్బును కాంట్రాక్టర్లకు ఇచ్చి ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం కాలనీలలోని నీరు, కరెంట్, రోడ్లు వసతులు ఉన్నాయని ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. తర్వాత గ్రామీణ ప్రాంతాలలోని ప్రోగ్రెస్‌పై హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు అందించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రాజశేఖర్, ఏఈ రామకృష్ణ, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్లు బాషా, అంకయ్య, సెక్రటరీలు పాల్గొన్నారు.

సొంతింటి కలపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

ఎర్రగుంట్ల : పేదవాడి సొంతింటి ఇళ్లపై గొప్పగా చెప్పే పాలకుల చేతుల్లో పేదలు విఫలమవుతున్నారని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : పాలిసెట్ ఉచిత శిక్షణకు హాజరైన విద్యార్థులు అధ్యాపకులు ఇచ్చిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష రాసే విద్యార్థులకు గత 10 రోజుల నుండి పట్టణంలోని పతంగే రామన్నరావు ప్రభుత్వ హైస్కూల్‌లో పాలిటెక్నిక్ అధ్యాపకులచే ఉచితంగా ప్రవేశ పరీక్ష కోచింగ్ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాచ్‌మెన్ దాడి

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వాచ్‌మెన్ వెంకటేష్‌తోపాటు బంధువులు కలిసి నరసింహ అనే వ్యక్తిపై దాడికి దిగారు. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం స్థానిక బాలికల పాఠశాల వీధిలో ఉన్న వంకదారి నరసింహ పాఠశాల ఆవరణంలో వాకింగ్ చేసేందుకు వెళ్తుండగా వాచ్‌మెన్, బంధువులు అడ్డుకున్నారు. అడ్డుకున్న వాచ్‌మెన్‌ను మిగతా వారు, వాకింగ్ చేస్తున్న నర్సింహులు ప్రశ్నించగా.. నాకే ఎదురు చెబుతావా అంటూ వాచ్‌మెన్ వెంకటేష్, బంధువులు కలిసి నరసింహపై దాడి చేశారు. ఈ దాడిలో నరసింహకు రక్తపు గాయాలయ్యాయి. దీంతో అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

డ్రైవర్‌కు గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న పాల్‌రెడ్డి ఫంక్షన్ హాలు సమీపంలో బుధవారం కారు, ఆటోలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు గాయపడిన ఆటో డ్రైవర్‌ను పులివెందుల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు పుల్లారెడ్డి హాస్పిటల్ వద్ద బుధవారం తెల్లవారుజామున విద్యుత్ స్తంభాన్ని ఇన్నోవా కారు ఢీకొంది. పట్టణానికి చెందిన హరికృష్ణ అనే డ్రైవర్ తన కారులో స్నేహితులను హైదరాబాద్‌కు వెళ్లే ట్రైన్ ఎక్కించేందుకు ఎర్రగుంట్లకు వెళ్లాడు. స్నేహితులను అక్కడ వదిలి తిరిగి పులివెందులకు వచ్చే సమయంలో పుల్లారెడ్డి ఆసుపత్రి వద్దకు రాగానే విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో విద్యుత్ స్తంభం పూర్తిగా ఒంగిపోయింది.

మట్కా బీటర్లు అరెస్టు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో ముగ్గురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.26,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

అపూర్వ సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్: కడపలోని శ్రీ రామకృష్ణ హైస్కూల్, శ్రీ రామకృష్ణ జూనియర్ కళాశాలలో 1965–2005 మధ్య చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం సికింద్రాబాద్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రకాష్‌రావు, సుజాత, శారద, శాంతలతోపాటు కొంతమంది గురువులు హాజరై పూర్వ విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులను సత్యనారాయణ (బాచు) ఆహ్వానించగా షేక్ షబ్బీర్ హుస్సేన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాల తర్వాత జరిగిన ఈ ప్రత్యేకమైన సమావేశంలో అందరం కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ జగదీష్ బాబు ఆర్థోపెడిక్ హెల్త్‌కేర్ గురించి వివరించారు. అనంతరం గురువులను సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంజీవ రెడ్డి, ఉదయ్ భాస్కర్ రెడ్డి, సి.ఎస్.జి. ప్రసాద్, రఘురామ్‌మూర్తి, శ్రీనివాసరావు, డాక్టర్ కొండారెడ్డి, గోపీనాథ్, సర్వద, షబ్బీర్ హుస్సేన్‌లతోపాటు నాగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సికింద్రాబాదులోని తాజ్‌మహల్ హోటల్లో కలుసుకున్న రామకృష్ణ, పాఠశాల, కళాశాల పూర్వ విద్యార్థులు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం

పులివెందుల టౌన్ : ప్రతి ఏడాది వేసవి కాలంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక వినాయక గుడి సమీపంలో ఉన్న విజయ మిల్క్ డెయిరీ యజమాని బండి రామకృష్ణారెడ్డి తన భార్య, బామర్ది జ్ఞాపకార్థం నెలరోజులపాటు ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఈ ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పాదాచారులకు, వాహనదారులకు మజ్జిగను పంపిణీ చేస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పాదాచారులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

పులివెందుల రూరల్ : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని ఏపీ కార్ల్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రకృతి వ్యవసాయ విధానాలు, వ్యవసాయ ఇన్‌పుట్స్ తయారీ, ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్, విత్తన గుళికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతపరిచేందుకు రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

భారతి డీఏవీ విద్యార్థుల ప్రతిభ

కమలాపురం : సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీల్లో డీఏవీ భారతి విద్యార్థులు ప్రతిభ కనబరచారని ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లో భారతి డీఏవీ పాఠశాలలో బుధవారం సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. లెవెల్–1 పోటీల్లో జోనల్ స్థాయిలో 44మంది బంగారు పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో ఒక విద్యార్థి రజత పతకం సాధించారు. అలాగే తరగతిలో 7మంది స్వర్ణ పతకాలు సాధించగా, 5 మంది చొప్పున వెండి, రజత పతకాలు సాధించారు. లెవెల్–2 పోటీలకు 95 మంది అర్హత సాధించారని ఆయన తెలిపారు. కాగా హెచ్ఆర్ హెడ్ గోపాల్ రెడ్డి ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కిషోర్ కుమార్

పిల్లలలో పోషణ పట్ల జాగ్రత్త వహించాలి

వేంపల్లె : పిల్లలలో పోషణపట్ల జాగ్రత్తలు వహించడంతోపాటు ఆరోగ్యకరమైన అలవాట్లను మంచి వాతావరణంలో ఉండేటట్లు చూడాలని సీడీపీఓ సునీత తెలిపారు. బుధవారం స్థానిక చింతలమడుగుపల్లె అంగన్‌వాడీ–2 కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు 7వ పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భధారణ మొదలు బిడ్డకు రెండేళ్ల వయస్సు వరకు పిల్లల జీవితంలో అత్యంత ముఖ్యమైన సమయమన్నారు. పిల్లల భవిష్యత్‌కు ఆరోగ్య విషయంలో పునాది వస్తుందని, 1000 రోజులలో బిడ్డ యొక్క మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. పిల్లల్లో రోగనిరోధక శక్తి, ఎదుగుదల బిడ్డ యొక్క సమగ్రాభివృద్ధి ఈ రోజుల్లోనే రూపుదిద్దుకుంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలని, గర్భం ధరించిన తర్వాత ఇనుము ఎక్కువగా ఉన్న పాలకూర, గోంగూర వంటి ఆకుకూరలను, అలాగే మాంస కృతులు ఎక్కువగా ఉన్న పప్పు దినుసులను, గుడ్లు, మాంసం, పాలు తీసుకోవాలన్నారు. గర్భధారణ సమయంలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను ఖచ్చితంగా 180 రోజులపాటు తీసుకున్నట్లయితే తల్లి రక్త హీనతకు గురికాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఫక్రుద్దీన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, సచివాలయ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బసవయ్య, ఎఎన్ఎం అంజలి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల అభివృద్ధి వైఎస్ కుటుంబంతోనే సాధ్యం

పులివెందుల : పులివెందులకు సాగు, తాగునీరు, సంక్షేమం, అభివృద్ధి వైఎస్ కుటుంబంతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిశోర్‌లు తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక వైఎస్ రాజారెడ్డి భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో 90 శాతం పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పులివెందుల అభివృద్ధి పనులు, జలజీవన్ మిషన్ వాటర్ ఇంటిగ్రేటెడ్ విధానం, క్రికెట్ స్టేడియం, షాపింగ్ కాంప్లెక్సులు, ఆగిపోయిన సిమెంట్ రోడ్లను పూర్తిగా నిర్వీర్యంచేసి ఇప్పుడు కూటమి నాయకులు నాటకాలాడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం పులివెందుల ప్రాంతంలో వ్యవసాయం నీటి ఆధారిత పంటలైన అరటి, దానిమ్మ, డ్రాగన్ హార్టికల్చర్ వైపు రైతులు వెళ్తున్నారంటే దానికి పులివెందుల ప్రాంతానికి సాగునీరు అందించిన ఘనత వైఎస్ కుటుంబానిది అన్నారు. జలజీవన్ మిషన్ కింద తాగునీటి కోసం మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ద్వారా ఇంటింటికి నీరు సరఫరా చేసే పనులు 95 శాతం పూర్తి చేస్తే, మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేయడానికి ఏడాది కావస్తున్నా పూర్తి చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కాంట్రాక్టర్లు కాదు ప్రభుత్వమే ఇక్కడ ఉన్న స్టేడియంను రద్దు చేసి నిధులు లేకుండా చేసి వాయల్పాడులో ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియానికి స్ప్రింక్లర్స్, మోటార్లతోపాటు మొత్తం మెటీరియల్‌ను తరలించారని, నిరూపించడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. రెండేళ్లు కోవిడ్ వచ్చిన పులివెందుల అభివృద్ధిని కొనసాగించిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని, కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు ఎన్ని రూపాయలు నిధులు విడుదల చేశారో చూపించాలన్నారు. పులివెందుల మోడల్ టౌన్‌కు గానీ, పులివెందుల మున్సిపాలిటీకి గానీ ఒక్క రూపాయి కూడా విడుదల చేసిన పాపాన పోలేదన్నారు. కమీషన్లు తీసుకొని కక్కుర్తి పడాల్సిన అవసరం వైఎస్ కుటుంబానికి లేదన్నారు. పులివెందుల ప్రాంతమన్నా, ఇక్కడి ప్రజలన్నా చంద్రబాబుకు విపరీతమైన కోపం, కక్ష అని, అందుకే మిగతా మున్సిపాలిటీలకు నిధులు వెచ్చించినా ఇక్కడ మాత్రం శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా కనీసం ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. అన్నిరంగాల వారిని మోసం చేసి కరెంట్ చార్జీలు పెంచి, స్మార్ట్ మీటర్లు లేకుండా చేస్తామని బురిడీ కొట్టించి, రైతులకు పెట్టుబడి సాయం, విద్యార్థులకు సరైన విద్యా వసతులు, ఉద్యోగులకు బకాయిలు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసి కొన్నివేల కోట్లు అప్పులు చేస్తూ ఇప్పుడు మేక వన్నె పులిలా మారి ప్రజలను పట్టి పీడిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి, కౌన్సిలర్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లయోలా విద్యార్థినుల సృజనాత్మకతకు శ్రీకారం


వినూత్న ఉత్పత్తులు తయారు చేసిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో బీకాం సెకండియర్ విద్యార్థినుల సృజనాత్మకతకు శ్రీకారం చుట్టారని ప్రిన్సిపాల్ జోజిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన బీకాం సెకండియర్ విద్యార్థినులు గౌరి, భవ్య, కీర్తన, మౌనిక, అమీనా, సాయిలత, హైందవి, లక్ష్మిలు ప్రతిభను, సృజనాత్మకను ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడే దిశగా వినూత్నమైన ఉత్పత్తులను రూపొందించారన్నారు. అలాగే పునర్వినియోగపరచగల పదార్థాలను వినియోగిస్తూ, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల జీవ స్నేహపూరిత ఉత్పత్తులను సృష్టించారన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్లు రమణారెడ్డి, హిమజ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఎర్రగుంట్ల : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈనెల 11వ తేదీన కమలాపురంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నామని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు రాధాకృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని కడప రోడ్డులో భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులు 12 రకాల సంక్షేమ ఫలాలు అందాల్సి ఉందన్నారు. అయితే 6 సంవత్సరాల నుంచి ఆ ఫలాలు భవన నిర్మాణ కార్మికులకు అందలేదన్నారు. వెంటనే భవన నిర్మాణ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : ఈనెల 11వ తేదీన స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించబోవు జాబ్ మేళాను మండలంలోని నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం బాగ్యమ్మ తెలిపారు. బుధవారం ఆమె తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టరు ఆనంద్‌నాయక్ ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలోని ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని 10వ తరగతి పాసైన నిరుద్యోగ మహిళలు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తమ వెంట తీసుకు రావాలన్నారు. వీవోఏలు, సీసీలు ఆయా గ్రామాల్లో అర్హత కలిగిన వారిని గుర్తించి వారికి జాబ్ మేళా గురించి వివరించి వారిని జాబ్ మేళా కార్యక్రమానికి తీసుకువచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఎంపికైన వారికి కంపెని వారు బస్సు సౌకర్యం కల్పిస్తారన్నారు.

చీని తోటల పరిశీలన

సింహాద్రిపురం : మండలంలో బలపనురు, అంకాలమ్మ గూడూరు, హిమకుంట్ల, సుంకేసుల, అహోబిలం గ్రామాల్లో ఉన్న చీనీ తోటలను బుధవారం శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, కె.అరుణోదయం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీని తోటల్లో కొన్ని ప్రాంతాల్లో నీరు అధికంగా ఉండటం, తేమ ఆరక పోవటంవలన చెట్లు వేర్లు త్వరగా కుళ్లిపోయి క్షీణిస్తున్నాయన్నారు. చీని చెట్లు దెబ్బ తినకుండా ఉండాలంటే రోజుకు 60 లీటర్ల మించి నీరు ఉండకూడదని, వేరు కుళ్ళు కనిపించిన తోటల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్ ఒక లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున కలుపుకుని చెట్ల మొదళ్లలో ఒక్కొక్క చెట్టుకు కలిపిన ద్రావణం 20 లీటర్లు పోసుకోవాలన్నారు. పోలుసు పురుగు, బంక తెగులు ఎక్కువగా ఉండటం వలన చెట్లు త్వరగా చనిపోతున్నాయని, వీటి నివారణకు గొనె సంచితో కాండం లేదా చెట్ల బెరడుపై బాగా రుద్దాలన్నారు. ఆ తర్వాత భూప్రొఫెజైన్ ఒక లీటర్ నీటికి 2 మిల్లీ లీటర్లు, బేనోల్ ఆయిల్ ఒక లీటర్ నీటికి 10 మిల్లీ లీటర్ల చొప్పున కలుపుకుని పిచికారి చేసుకున్నట్లయితే పొలుసు పురుగు శాశ్వతంగా నివారించుకోవచ్చునన్నారు. ట్రికోడర్మా, సూడోమోనస్ ద్రావణాన్ని సంవత్సరానికి రెండు సార్లు భూమిలో వేసుకున్నట్లయితే వేరుకుళ్లు రోగాన్ని శాశ్వతంగా నివారించుకోవచ్చునని శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఓ మల్లేశ్వరరెడ్డి, రైతుసేవా కేంద్ర సిబ్బంది ఉష, శ్రీలేఖ, దీపిక, గ్రామ రైతులు పాల్గొన్నారు.


చీనీలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

అనర్థదాయక వ్యర్థాలు పర్యావరణానికి ముప్పు

వేంపల్లె : అనర్థదాయక వ్యర్థాలు పర్యావరణానికి ముప్పు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ×ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై¤ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులను మరల ఉపయోగించకుండా పారవేసినప్పుడు వాటిని ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అంటారన్నారు. వీటి ద్వారా భూమి, నీరు, వాతావరణం కలుషితమవుతుందని, పర్యావరణానికి పెను ముప్పుగా మారి వాతావరణం అసమతుల్యత ఏర్పడుతుందన్నారు. ఈ వ్యర్థాల వల్ల నష్టాలు, ఆరోగ్య సమస్యలను నివారించేందుకు మూడు ముఖ్యమైన పద్ధతులను అవలభించి కాలుష్య నివారణకు దోహద పడాలన్నారు. ప్రతి తరగతి గదికి డ్రస్ట్ బిన్లను అందజేశారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.